ఆశ్రమం - ఆశ్రయం

కొండముది రుక్మిణీదేవి

తలుపు దబ-దబా బాదిన చప్పుడైంది. చదువుతున్న ఉత్తరాన్ని పక్కనపెట్టి, వెళ్లి తలుపు తీశాడు ఆనందరావు.

ఎదురుగా కొత్త వ్యక్తి. ఒకచేతిలో బట్టలసంచి, మరొక చేతిలో పుస్తకాల కట్ట, చంకలో దిండు.

"ఎవరు కావాలండీ?!" అడిగాడు ఆనందరావు.

"నన్ను లోపలకు రానివ్వండి. తరువాత మాట్లాడుకుందాం !"

"ఎవరో ఏమిటో చెప్పకుండా...?" సందేహించాడు ఆనందరావు.

"చెబుతాగా ! చెప్పటానికేగా వచ్చాను. ముందు ఈ బరువు దించుకోనివ్వండి. అబ్బ ! కాసిని చల్లని మంచినీళ్లు తాగి ప్రాణం నిలుపుకోవాలి" అంటూ అడుగు లోపలికి పెట్టి, చేతిలో వున్న సామాను గోడవారగా దించాడు.

ఆ చర్యతో అవాక్కయిన ఆనందరావు, తన వయసులోనే వున్న ఆ వ్యక్తిని ఏమీ అనలేక, తనే వెళ్లి కూజాలో వున్న మంచినీళ్లు గాజుగ్లాసులోకి వంచి తీసుకొచ్చి ఇచ్చాడు. ఆ గ్లాసుడు నీళ్లు గడగడ తాగి, "అన్నదాతా సుఖీభవ" అన్నారు గాని, "నీళ్లదాతా సుఖీభవ" అంటాను నేను. మీరేమంటారు ?

"అబ్బే ! ఏమంటాను ?" ఆ మనిషి కలుపుగోలుతనానికి ఆశ్చర్యపోతూ నసిగాడు ఆనందరావు.

"అమ్మయ్య ! ఇహ ఇప్పుడు మీరా మంచంమీద కూర్చోండి. నేను ఈ కుర్చీలో కూర్చుంటాను.

ఇప్పుడు టైం రాత్రి పది గంటలు దాటింది. నేను చెప్పేది వినే ఓపిక మీకుందా ?"

"చెప్పండి !" అన్నట్లు ఆయనవంక చూశాడు ఆనందరావు.

"నాపేరు బ్రహ్మానందం. నాది అయితానగరం. నేను రిటైర్డు టీచర్ని. ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు నా సంతానం. ఇహ ఇల్లు - ఇల్లాలు అంటారా ? ఇల్లు కట్టలేకపోయాను, ఇల్లాల్ని పోగొట్టుకున్నాను !"

"ఓహో ! నాలాంటి కేసేనన్నమాట" మనసులో అనుకున్నాడు ఆనందరావు.

"చూడండి మీరేదో ఆలోచిస్తున్నట్లున్నారు. మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం నా ఉద్దేశం కాదు. ఈ తలగడా వేసుకుని, దుప్పటి పరుచుకుని నేను పడుకుంటాను. మీ మంచంమీద మీరు హాయిగా, సుఖంగా నిద్రపొండి ! గుడ్ నైట్ !" అంటూ వెళ్లి కిలా పడుకొని, దుప్పటి కప్పేసుకున్నాడు బ్రహ్మానందం.

ఆనందరావుకు అతణ్ణి ఎలా వదిలించుకోవాలో అర్థం కాలేదు. పైగా ఇంత రాత్రి వేళ ఇలా వచ్చాడంటే ఆఫీస్ ఫార్మాలిటీస్ పూర్తిచేసే ఉండడు. తెల్లవారి వార్డెన్ కి ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి?

బ్రహ్మానందం దుప్పటి పక్కకు తప్పించి "ఇంతకీ మీ పేరు ?" అడిగాడు.

"ఆనందరావు !" అప్రయత్నంగా చెప్పేశాడు.

"మీరు నాకొక్క సహాయం చెయ్యాలి. నేను ఆఫీసులో అప్లికేషన్ పూర్తిచేసి డబ్బు కట్టలేదు. రేపు ఆ ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేస్తాను. ఈలోగా ఏదైనా ఎంక్వయిరీ వస్తే మీ అన్ననో, తమ్ముణ్ణనో చెప్పండి" అంటూ మళ్లీ దుప్పటి కప్పుకున్నాడు బ్రహ్మానందం.

ఆయన వింత మనస్తత్వానికి ఆశ్చర్యపోతూ, లైటార్పి మంచంమీద వాలాడు ఆనందరావు.

ఇక్కడ ఆ వృద్ధాశ్రమాన్ని గురించి కొంచెం తెలుసుకోవాలి.

దాన్ని ఒక విదేశీయుడు స్థాపించాడు. ఊరికి దూరంగా, ప్రకృతి అందాలకు దగ్గరగా అంటే ఒకవైపు తామరకొలను, మరొకవైపు మామిడి తోట, ఇంకొకవైపు ఆకాశాన్నంటే పర్వతపంక్తులు, నాలుగోవైపు నవనవలాడే వరిచేలు. వీటిమధ్య ఆరంతస్థుల భవనం. అందులోనే ఒకవైపు స్త్రీలకు కేటాయించారు. అయితే స్త్రీలకు కేటాయించిన గదులు తరచూ ఖాళీ అవుతూనే ఉంటాయ్ ! క్రిందవరస ఆఫీసు, వంటగదులు, అతిధుల కోసం పెద్ద హాలు. అక్కడ పనిచేసేవాళ్లందరూ అక్కడే ఉంటారు.

రెండోఅంతస్థు మొదటి తరగతి వాళ్లకు కేటాయించారు. అంటే తమకున్న ఆస్తిపాస్తుల్ని ఆశ్రమానికే విల్లు వ్రాసి, ఆశ్రమ అభివృద్ధికి, తద్వారా మానసిక ఆనందానికి పాటుపడే వాళ్ల కోసం. ఈ మొదటి తరగతి ఆశ్రమ వాసులకు ఒక్కొక్కరికి ఒక్కోగది కేటాయిస్తారు. అందులో ఎటాచ్డ్ బాత్, ఒక సీలింగ్ ఫాన్, ఒక మంచం, పరుపు, పోర్టబుల్ టీవీ, చిన్నసైజు ఎయిర్ కూలర్ ఉంటాయి. వాళ్లు ఒక అతిధిని రెండు రోజులు తమతో ఉంచుకోవచ్చు. మిగిలిన అంతస్థుల్లో వాళ్ల వాళ్ల ఆర్థిక అసమానతల్ని బట్టి సౌకర్యాలుంటాయి. అన్ని అంతస్థులకు లిఫ్టు ఉండటంతో ఎవరికీ పెద్దగా ఇబ్బంది ఉండదు. అయితే ముఖ్యమైన షరతులు ఏమిటంటే తమకు వచ్చే ఆదాయంలో పదిశాతం తప్పనిసరిగా ఆ ఆశ్రమానికి ఇవ్వాలి. ఆ తరువాత స్వచ్ఛందంగా ఎవరి ఇష్టం వచ్చింది వాళ్లు ఇవ్వవచ్చు.

తెల్లవారి ఆనందరావు లేచేసరికి బ్రహ్మానందం తన కాలకృత్యాలు తీర్చుకుని పేపరు చదువుతున్నాడు. ఆయన కళ్లు తెరవటం చూసి, ఆరోజు పేపర్లో వచ్చిన విశేషాలు గబగబా చెప్పి, "దేశం నాశనం అయిపోతున్నదండీ ! పిల్లలు శ్రద్ధగా చదవరు, పెద్దవాళ్లు, వృద్ధుల్ని గౌరవించరు, ఉద్యోగులు తమపన్లు సరిగ్గా చెయ్యరు. ఆఖరికి తద్దినం బ్రాహ్మలు కూడా సరిగ్గా మంత్రాలు చెప్పటం మానేశారంటే నమ్మండి" అన్నాడు బ్రహ్మానందం.

ఆయన వాక్ప్రవాహానికి ఆనందపడ్డా, అనవసరపు మాటలకు మొహం చిట్లించుకుని బాత్ రూం వైపు నడిచాడు.

ఆనందరావు స్నానాదికాలు పూర్తిచేసుకు వచ్చేసరికి బ్రహ్మానందం అక్కడ లేడు. "బయటకు వెళ్లి ఉంటాల్లే" అనుకుని తన దినచర్యలో మునిగిపోయాడు. ఎండ మొహం మీద పడటంతో కిటికీ కర్టెన్ వేసొద్దామని వెళ్లిన ఆనందరావుకి దూరంగా నీరుకావి పంచెతో అటుతిరిగి పూలుకోస్తున్న మనిషి కనపడేసరికి "ఎవరబ్బా !" అని క్షణం ఆలోచించాడు. వెంటనే గుర్తొచ్చింది. ఆ మనిషి బ్రహ్మానందమేనని.

"అయ్యో! పూలుకోస్తున్నాడు-తోటమాలి ఏమన్నా అంటాడేమో ?" ఇక్కడ ఎంత ప్రశాంతంగా వుంటుందో, అంత కఠినంగా వుంటాయి కొన్ని షరతులు. అందులో "పూలుకొయ్యకూడదు" అనేది ఒకటి. విదేశీయుడైన ఆ యజమాని ప్రకృతి ఆరాధకుడు. అందులోనూ పువ్వులన్నా, (బోసి)నవ్వులన్నా, మరీ ఇష్టం. అందుకే ఏ చెట్టుమీదా చెయ్యి వెయ్యనివ్వడు, ఏ మనిషి మీదా ఈగను కూడా వాలనివ్వడు.

ఆనందరావుకి తన మనస్తత్వంమీద తనకే నవ్వొచ్చింది. కొన్నిగంటల పరిచయంలోనే ఆయన మీద తనకెందుకీ జాలి ? ఆయన్ని వాళ్లేమన్నా అంటే తనకెందుకు బాధ ? అంతలోనే తన గతం గుర్తుకొచ్చింది.

ఒక పనివాడికోసం తను కన్నబిడ్డతో మాట మాట పెరిగి తనిక్కడకు వచ్చేశాడు. అయినా అదేమంత పెద్ద విషయమని ! వాడి పట్టుదలే వాడిదిగాని !

"అష్టరాల్ ఒక నౌకరు కోసం ఇంతపెద్ద ఇంట్లో నువ్వొక్కడివీ వుండొద్దు నాన్నా, మా దగ్గరకొచ్చెయ్!" అన్నాడు తన కొడుకు.

అక్కడేవున్న ముత్యాలు "బాబయ్యా ! నాకన్యాయం చెయ్యకండి, ఈ మట్టితప్ప నాకింకేటీతెల్దు. ఈ శరీరం-ఈ గాలి, నీరుతో పెరిగింది. మీ ఉప్పుతిన్న యిశ్వాసం నన్ను నిలుపుకోనివ్వండి. మిమ్మల్ని మోసిన ఈ భుజాలు ఈడనే మట్టికానివ్వండి" అంటూ

విద్యార్థులలో అశాంతి ఎందుకు?

క్లాసులో లెసన్ వినాలనుకున్నా అల్లరి కుర్రాళ్ల బారినపడి వినలేకపోవటం, చక్కగా చెప్పే ఉపాధ్యాయులు కరువవటం, ఎగ్జామ్స్ కి బాగా ప్రిపేర్ అయితే... పేపర్ అవుట్ కావటం, క్లాసు తెచ్చుకొని కూడా డొనేషన్ కడితేనేకాని కావలసిన చదువు చదవలేకపోవటం, ఇంటర్వ్యూలో మెరిట్ కి వేల్యూ ఇవ్వకపోవటం, పిచ్చి వాళ్లలా ఎదురు చూసినా ఉద్యోగం రాకపోవటం, ఇవే...ఇవే నేటి విద్యార్థులలో అశాంతికి ముఖ్యాతిముఖ్యమైన కారణాలు.

వంకధార మణిమాల,
కె. కోటపాడు.

కాళ్ళు పట్టుకున్నాడు.

ఆనందరావు మనసు ద్రవించింది. ముత్యాలకు ఈ ఇంటితో సంబంధం ఈనాటిదికాదు. అతని తాత, తన తాత దగ్గర పనికికుదిరాట్ట, అప్పటినుంచి ఆ కుటుంబం ఈ కుటుంబానికి సేవచేస్తూనేవుంది. కేవలం పని చేయటమేకాదు మనసు పొరల్లో ఏదో మమత, చెప్పలేని వాత్సల్యం, పైకి కనపడని అనురాగం. అందుకే.

"ముత్యాలు వున్నన్నాళ్ళూ నేను ఇక్కడే వుంటాన్రా !" అని గట్టిగా చెప్పాడు కొడుకుతో.

"అయితే నాకంటే వాడే ఎక్కువా నీకు !?"

తన మౌనం అర్ధాంగీకారంగా తీసుకుని వెంటనే ఆస్తిపంచి ఇవ్వమన్నాడు-ఆ ఆవేశంలో వాడి వాటా వాడికిచ్చి-ఇల్లు మాత్రం ముత్యాలు బ్రతికివున్నన్నాళ్ళువుండి తదనంతరం కొడుక్కి చెందేట్టుగారాసి, తన వాటా పొలం, తోటలు, డబ్బు అన్నీ ఈ ఆశ్రమానికి రాసిచ్చి తనిక్కడికి వచ్చేశాడు.

"ఏంచేస్తున్నారు ? ఇక్కడ మెయింటెనెన్స్ చాలాబాగుందండీ ! ఎవరిపని వాళ్ళు శ్రద్ధగా చేస్తున్నారు. నేను అలా ఓ రౌండువేసి, ఆదెమ్మగారు పూజ చేసుకుంటుంటే కాసిని పూలు కోసిచ్చాను. రెండో అంతస్తు మూడోగదిలో రమణయ్యగారు మూలుగుతుంటే కాసేపు మనిషి సాయంగా కూచున్నాను. ఇంతలో ఆఫీసు తెరిచారు. అప్లికేషను పూర్తిచేసి డబ్బు కట్టేశాను. అయిదో అంతస్తు మొదటి గదిలో ఒక్కరేవున్నార్ట, నన్నందులో జాయిన్‌కమ్మన్నారు. స్టోర్‌రూం చూశానండీ ! ఎంత పెద్దదో ! సంవత్సరానికి సరిపడా సామగ్రి అంతా ఒక్కసారే కొంటారనుకుంటాను. ఈ గదిలో ఒక్కరూ ఏంచేస్తున్నారు ?" అంటూ అడక్కుండానే సంగతులన్నీ చెప్పాడు బ్రహ్మానందం.

ఆనందరావు గోడగడియారం వైపు చూశాడు-పన్నెండు కావస్తున్నది.

"అయిపోతున్నదండీ ! వంట అయి క్యారేజీలు సర్దుతున్నారు. ఇందాకే చెప్పాగా, ఎవరిపన్లు వాళ్ళు మిషన్లలాగా చేస్తున్నారంటే నమ్మండి రెండోతరగతి వాళ్లందరికి కామన్ హాల్లో భోజనాలు పెడతారటగదండీ ! నేను వెళ్తున్నాను నా సామాను నా గదిలోపడేసి వెళ్లి హాల్లో కూర్చుంటాను. నేను వస్తూనేవుంటాను, మీకు బోరుకొడితే పిలవండి. అయినా మనందరం ఒకటండీ ! ఇక్కడ వున్న వాళ్లం, వుండాల్సినవాళ్లం" అంటూ వంగి తన సంచి తీసుకుంటున్న బ్రహ్మానందం కళ్ల నుంచి జారి రెండు కన్నీటిబొట్లు నేలమీద పడ్డాయ్ ఆ నిశ్శబ్ద వాతావరణంలో కొద్దిగా

ఆశ్రమం-ఆశ్రయం

చప్పుడుచేస్తూ. ఆ సంఘటన ఆనందరావుని దాటిపోలేదు.

వెనక్కి తిరిగిచూడకుండా తన సామాను చేతబట్టుకుని మెట్లవైపు నడిచాడు బ్రహ్మానందం. ఆయనకెందుకో లిఫ్టు ఎక్కబుద్ధికాలేదు. జీవితంలోలాగానే ఒక్కొక్క మెట్టు ఎక్కి పైకి వెళ్లాలనిపించింది. ఆ అడుగుల సవ్వడి అనంత జీవిత యాత్రలో శ్రుతి పక్వంగానూ, లయబద్ధంగానూ వినిపించసాగింది. మరెందుకు మధ్యలో తనకీ అపశ్రుతులు ? అవమానాలు? పిల్లలకు తనను చూస్తే ఎక్కడ చదువుకోమని కూర్చోబెడతానోనని భయం. కొడుకులకు నీతిగా బ్రతకమని చెబుతాడోనని అసహ్యం, కోడళ్లకు పొదుపుగా సంసారాలు చక్కదిద్దుకోమని సలహా ఇస్తాడని కోపం. అందుకే అందరూ తప్పించుకుని తిరుగుతారు. మనస్ఫూర్తిగా ఒక్కరూ మాట్లాడరు తనతో. ఆ వంటరితనాన్ని భరించలేక ఇక్కడికి వచ్చాడతను. ఇదోకొత్తజీవితం, ప్చ్....అనుకుంటు తనకు కేటాయించిన గదిలోకి వెళ్లాడు.

ఆరునెల్లు ఆనందంగా బ్రహ్మానందంగా గడిచిపోయింది ఆయనకు. ఆ ఆశ్రమంలో ఎప్పుడు ఎవరికి ఏ అవసరంవచ్చినా, ఏ సహాయం కావాలన్నా, బ్రహ్మానందాన్నే పిలుస్తున్నారు "ఏమండీ! బ్రహ్మానందంగారూ! ఏమయ్యా! బ్రహ్మానందం ఒరే ! బ్రహ్మం" ఇలాంటి పిలుపులతో క్షణంతీరిక వుండటం లేదు. ముఖ్యంగా ప్రతిరోజు సాయంకాలం నాలుగు గంటల నుంచి ఆరుగంటలదాకా ఆయనచేసే ప్రవచనం, భారత, భాగవత, రామాయణాలు, అందర్నీ ఆకట్టుకున్నయ్ ! మొదట ఒకరిద్దరుగా మొదలైన ఆ కార్యక్రమం ఇప్పుడు అక్కడున్న సభ్యులకే కాక, పనిపాటలు చేసుకునేవాళ్లందరికి అదో దివ్యానుభూతి అవుతున్నది. విశేషమేమిటంటే ఆ ఆశ్రమ యజమాని అయిన విదేశీయుడ్ని సహితం ఆకట్టుకున్నది ఆయన కంఠస్వరం.

త్వరలో
"న్యూమరాలజీ"
మీద
ప్రత్యేక శీర్షిక!

భావయుక్తంగా పద్యాలు చదివే ఆ తీరు.

ఉన్నట్టుండి ఒకనాడు అందరి దగ్గరా శలవుతీసుకుంటున్నాడు బ్రహ్మానందం.

ఆయన ఎందుకు వెళ్లిపోతున్నాడో ఎవరికీ అర్థంకావటంలేదు. అడిగిన వాళ్లకు, అడగని వాళ్లకు-"నన్ను చూడటానికి ఎప్పుడన్నా వీలయితేరండి, నా పేరు బ్రహ్మానందం. మా వూరు అయితానగరం, గుర్తుంచుకుంటారుగా, శెలవు! " అంటూ నమస్కారం చేస్తున్నాడు. ఆయన మాట్లాడుతున్న తీరు అందరికీ కన్నీళ్లు తెప్పిస్తున్నది.

బ్రహ్మానందం లేని ఆశ్రమం నిద్రపోతున్న కుగ్రామంలా వుంది. ఎవరిపన్లు వాళ్లు చేసుకుంటున్నా ఏదోవెల్తి, ఎవరికోసమో ఎదురుచూపు అప్పుడే అక్కడున్న అందరికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. "తామేవెళ్లి ఆయన్ను ఒకసారి చూసొస్తే!?" అవును చూడాలి. చూసితీరాలి. ఒకరిద్వారా ఒకరు పనివాళ్లు, వంటవాళ్లు ఆఖరికి వాచ్‌మెన్ కూడా బయలుదేరటం చూసి, "వాట్‌హేపెన్డ్? వేరార్ యు గోయింగ్?!" ఆశ్చర్యంగానూ ఆందోళనగానూ అడిగాడు విదేశీ యజమాని. మేమందరం బ్రహ్మానందాన్ని చూడటానికి వెళ్తున్నాం, ముక్తకంఠంతో అన్నారంతా.

"పూర్ ఫెలో! అయాం ఆల్సోకమింగ్ టు సీద పర్సన్" అంటూ అడుగు ముందుకు వేశాడు. అక్కడున్న అందరూ ఆయన్ను అనుసరించారు.

* * * *

"ఇంట్లోనుంచి చెప్పాపెట్టకుండా వెళ్లి మా పరువుతీశావ్! ఇంట్లో చేస్తున్న భాగోతం చాలక దేశమంతా కొడుకులు సరిగాచూడటంలేదని చాటింపు వెయ్యదల్చుకున్నావా? మమ్మల్నేమీచెయ్యలేవు. నీ మాట వినేవాళ్లెవరూ లేరిక్కడ. ఇంతతిని ఇంట్లోపడుంటావనుకుంటే అదీచెయ్యలేవా?"కోపంగా పెద్దగా అరుస్తున్నాడు కొడుకు.

"అసలు మిమ్మల్ని అనాలి! పీడావిరగడైపోయిందనుకుంటుంటే మళ్లా పేపర్లో వేయించి, అదీఫొటోతోసహా ! అడ్రసు తెప్పించుకువెళ్లి మరీతీసుకొచ్చారు. అనుభవించండి. ఆయన మూలంగా మనకేమీలాభం లేకపోతేమానె, ఈ నస, అప్రతిష్ట నేను భరించలేను." కోడలు ఉవాచ.

అక్కడ ఏ మాటకూ బ్రహ్మానందం నుంచి జవాబులేదు.

అప్పుడే అక్కడకు వచ్చిన ఆశ్రమవాసులు అందరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. తరువాత అందరూ కలిసి విదేశీయుడి వంక చూశారు.

ఆ చూపులో ఆయన ఆచూకి తెలియజేసి తప్పుచేశామన్న భావం వుంది. దాన్ని గ్రహించిన ఆ యజమాని తలవంచుకున్నాడు.